"ఇది మరీ బాగుంది. నీ చెల్లాయి రావటం కాస్త పనీ పాటా చెయ్యటానికా? సినిమాలవీ చూడటానికా !"

"ఫర్వాలేదు. లలితకి ... అన్నీ వచ్చు. దానిదగ్గర పిల్లలకికూడా అలవాటే."

"సరే! అయితే"—తీరా బయల్దేరబోతూ వెనక్కి తగ్గి-"అసలు లలితని పంపిస్తారా మీవాళ్ళు?" అన్నాడు ప్రకాశం సందేహిస్తూ.

"ఏం? ఎందుకు పంపించరు?" కళ్ళువిప్పి ఆశ్చర్యంగా చూసింది ఇందిర.

"ఏమోలే! పెద్దవాళ్ళ కన్నీ ఎక్కడలేని అనుమానాలు."

"అసలు వాళ్ళకులేని అనుమానాలన్నీ మీకే."

ప్రకాశం మరేమీ అనకుండా వెళ్ళిపోయాడు.

మర్నాడు సాయంత్రంవేళ వచ్చింది లలిత.

సాక్షాత్తూ దేవతలా కన్పించింది ఇందిరకి—"వచ్చావా తల్లీ! అబ్బ! జ్వరంతో నేను మంచం ఎక్కితే ఇల్లు చూడు ఎలా ఉందో! అదిగో! చంటివెధవ రాగం....వంటింట్లో స్టౌ వుంది. బల్లమీద పాలు న్నాయి. కొంచెం వెచ్చబెట్టి ముందు వాడికిచ్చెయ్. లేకపోతే ఒకరిమాట వొకరికి విన్పించవు. వెళ్ళు ముందు" అంటూ పని పురమాయించింది.

లలిత కార్యరంగంలోకి దూకుతోన్నట్లు—పైటకొంగు నడుంచుట్టూ బిగించింది- "రారా గాడిదా! ఎందుకలా అరుస్తావ్ ఇంజన్ లాగా?" అంటూ వాణ్ణి బరబరా లాక్కుపోయింది. మరో పావుగంటకి కానీ వాడి రాగం కట్టలేదు నీళ్ళుపోసి వుతికిన చొక్కా తొడిగి తీసుకొచ్చింది.

"వీడు నా దగ్గర కూర్చుంటాడుగానీ-రెండు డబ్బాలు బియ్యం కొలిచి అన్నం వండు. పొద్దుటి కూరలేవో వున్నాయిలే, ఫర్వాలేదు. నీ స్నానం అయ్యాక మళ్లా వేడినీళ్ళు పడేయ్" ఓపిక తెచ్చుకుంటూ చెప్పింది ఇందిర.

"బావగా రెప్పుడొస్తారు?"

అసలు ఇప్పుడు నేనేం కానిపని చేశానని ఇంత నిలదీసి ప్రశ్నలు వేస్తున్నావు?"

"మీరేం చేసినా నేను ప్రశ్నలు వెయ్యను! వెయ్యకూడదు. హృదయాలు చంపుకుని, సాహసించి చేస్తే ఏదీ కానిపని అవ్వదు. మీరు ఆఫీసులో కష్టపడి యింటికి రావటం ఇవ్వాళ నాకు కొత్తకాదు. నా దగ్గర కూర్చుని మీ మంచిచెడ్డలు ముచ్చటించేవారు. మాటల్లో మునిగి బయట చికాకులన్నీ మర్చిపోయేవారు. గడిచిపోయిన ప్రతిక్షణాన్ని నేనుగుండెల్లో గుప్తంగా దాచుకున్నాను. అందుకే నాకింత బాధ! ఈ నెల్లాళ్ళలోనూ ఒక్క పూటైనా, ఒక్క పావుగంట, కనీసం పది నిమిషాలైనా నాదగ్గిర కూర్చుని కష్టసుఖాలు అడిగారా? మనస్సువిప్పి మాట్లాడారా? ఏదీ? మీకు తీరికేదీ? రోగిష్టిదానితోపాటు ఈ మారుమూల గదిలో కూర్చునేంత ఓపి కేదీ? పోనీ మీతోపాటు....ఒక్కరోజైనా ఎప్పుడైనా బయటికి తీసుకువెళదా మన్న ఆలోచనన్నా వచ్చిందా? ఏం? నేను మీతో నవ్వుతూ మాట్లాడ లేనా? హాయిగా చల్లగాలిలో తిరగలేనా? రిక్షాలలో వెళ్ళి సినిమాలు చూడ లేనా? కాళ్ళులేని కుంటిదాన్నయ్యానా? పుట్టెడు జ్వరంవచ్చి- నీరసంతో బాధ పడుతున్నానని నన్ను మీరేం కనికరించారా? నా కష్టసుఖాలు పంచు కోవాలని మీరేం ప్రయత్నం చేశారు? ఈ నెల్లాళ్ళనుంచీ ప్రతి క్షణం నే నెంత కుమిలిపోయానో_మీ సానుభూతికోసం ఎంత తపించానో మీకు తెలుసా? అసలీ ఇంట్లో ఇందిర అంటూ ఒక దౌర్భాగ్యురాలు ఉందన్న సంగతే విస్మరించి _ నేనేం కానిపని చేశానని సమర్ధించుకుంటున్నారా?"

ప్రకాశం నోరు విప్పి మాట్లాడలేక _ వూరుకోలేక _ విసురుగా తల విదిలించాడు_ అవును. తెలివి తక్కువే ఒక్కసారైనా ఇందిర కూడా వస్తుందేమో అడగలేదు. రమ్మనిపిల్చి తీసికెళ్ళలేదు. అలా గంటల తరబడి_ యింట్లో ఒక్కతే ఎలా వుండగలదనికూడా ఆలోచించలేదు. కానీ....కానీ__నిజంగా ఇందిరంటే తనకేం ద్వేషం కాదే! అయిష్టం కాదే!__

__"యిదంతా నా బాధకొద్దీ నేను అడిగాను. పోనివ్వండి. ఏడ్చి

